వెళ్లి రావయ్యా గణేశా !


నిమజ్జనానికి తరలుతున్న కొల్లూరు లాక్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం


కొల్లూరు గౌడపాలెం కాళీకృష్ణ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనోత్సవం

కొల్లూరు : వినాయక చవితి ఉత్సవాలలో కొలువుదీరిన భారీ గణనాథులు భక్తుల కోలాహలాల మధ్య నిమజ్జనానికి తరలి వెళ్లాయి. వెళ్లి రావయ్యా గణేశా.. మళ్లీ రావయ్యా గణేశా అంటూ భక్తులు సాగనంపారు. కొల్లూరు లాక్ సెంటర్‌లోని విఘ్నేశ్వరుడి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడితో పాటు కొల్లూరు గౌడపాలెం కాళీకృష్ణ ఆలయం వద్ద పదకొండు రోజులుగా పూజలందుకుంటున్న ఏకదంతుడి ప్రతిమలను భారీ ఊరేగింపుల నడుమ నిమజ్జనోత్సవానికి తరలించారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులు లంబోధరుడి శోభయాత్రలో పాల్గొని, భక్తి శ్రద్ధలు చాటుకున్నారు. డప్పు కళాకారుల విన్యాసాల నడుమ కొల్లూరు పురువీధులు సందడిగా మారాయి. భారీ ఊరేగింపుతో గణనాథులును నిమజ్జనానికి తరలించి భక్తులు వీడ్కోలు పలికారు. తొలుత రెండు ప్రాంతాల్లో లడ్డూ వేలం పాటలు పోటాపోటీగా జరిగాయి. చంద్ర గ్రహణం కారణంగా సాధారణంగా జరిగే అనంత చతుర్థి రోజుకు బదులుగా ఒక రోజు ముందుగా స్థానిక ఈపూరు రోడ్డులోని పశ్చిమ బ్యాంక్ కెనాల్‌లో గణనాథులను నిమజ్జనం చేశారు.

క్లుప్తంగా

గ్రేస్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

భట్టిప్రోలు: అమృతలూరు మండలం మూల్పూరుకు చెందిన ఉప్పలపాటి ఏసోబు భార్య మరియమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేమ్ రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో పెరవలి మస్తాన్, బందేల కోటయ్య, రాజు, సురేష్ పాల్గొన్నారు.

సీజీజీబీ మేనేజర్ రవికుమార్‌కు సన్మానం



వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) మేనేజర్‌గా ఖాతాదారుల మన్ననలు పొంది గత ఆరేళ్లుగా సేవలు అందిస్తున్న ఎస్. రవికుమార్ నరసరావుపేట రీజినల్ కార్యాలయంలో రికవరి మేనేజర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా బదిలీ ఆయన్ను శనివారం ఏపీ కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు కోడూరు వెంకటేశ్వరరావు, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఓఏటీ పి. కల్పన రాజు, అప్రైజర్ జె. బాలకృష్ణ, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ



వేమూరు: బాలికలు ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి సూచించారు. బాలికలపై వివక్ష చూపరాదని తల్లిదండ్రులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికల వికాసంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ, చదువు ఆవశ్యకత గురించి కిశోర బాలికలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో బాలురు, బాలికలను సమానంగా చూడాలని చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, అమల, రెబ్బమ్మ, రాజకుమారి పాల్గొన్నారు.

వైభవంగా రుక్మిణీ కల్యాణం



కొల్లూరు : భాగవత సప్తాహ మహోత్సవంలో భాగంగారుక్మిణీ కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కొల్లూరు శ్రీ పార్వతీ సంస్కృత పాఠశాలలో శంకర సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 109వ శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నైషధం వెంకటమూర్తి, మంజుల దంపతులతో రుక్మిణీ కల్యాణం
మహోత్సవాన్ని కొతా రాజేష్ శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని వివాహాలు, నరకోద్ధరణం, సృగోపాఖ్యానం, కుచేలోపాఖ్యానం తదితర సప్తాహాలు నిర్వహించినట్లు శంకర సేవా సమితి సభ్యులు కల్లూరు వెంకట సూర్యనారాయణమూర్తి తెలిపారు.

ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం



కర్లపాలెం: కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నూతన పాలక మండలి సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. యాజలి గ్రామంలోని త్రిదేవాలయ ప్రాంగణంలో ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. చైర్మన్‌గా ఇక్కుర్తి చక్రపాణి, సభ్యులుగా పందరబోయిన నాగేశ్వరమ్మ, దామర్ల జ్యోతి, తలపల పోలమ్మ, మాచవరపు సుబ్బారావు, ఓగేటి ప్రణవ్‌మూర్తి, ఏపూరి రమేష్, ఏలూరి నాగేశ్వరరావు, చదలవాడ లక్ష్మీ తిరుపతమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ గోపి, జనసేన నాయకులు శివన్నారాయణ, రాయపాటి అరుణ, బీజేపీ నాయకులు పరిమి సాయిబాబు పాల్గొన్నారు.

ఉత్తమ గురువులకు సత్కారాలు


రోజా రమణిని సన్మానిస్తున్న హైస్కూల్ బృందం


శ్రీనివాసరావును సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు

భట్టిప్రోలు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న మండలంలోని వెల్లటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎల్ఈ) ప్రధానోపాధ్యాయురాలు ఓలేటి రోజా రమణిని శనివారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ కరస్పాండెంట్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పి. మల్లికార్జునరావు, హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ అత్తోట సుగుణకుమారి, పెసర్లంక హెచ్‌ఎం వి. సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, మురళీధరరావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, సుబ్బారావు, ఉమామహేశ్వరరావు, ఎండీ అనూల్‌హక్, చేబ్రోలు శ్రీనివాసరావు, లక్ష్మీ పార్వతి, సత్య రత్న పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం

భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (హెచ్‌ఈ)లో శనివారం విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు (బీఎస్ఆర్)ను ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పసుపులేటి శివరామ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీనివాసరావు చిన్ననాటి నుంచి కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చి, నలుగురికి ఉపయోగపడే విధంగా ఎదిగారని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వంగర విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు నీలా సుధారాణి, ఎస్‌ఎంసీ చైర్మన్ డొక్కు శ్రీలక్ష్మి, వైస్ చైర్మన్ ఆఫీజ్, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి మజుందార్


సమావేశంలో మాట్లాడుతున్న మజుందార్

కొల్లూరు : కూటమి ప్రభుత్వం కార్మిక సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్. మజుందార్ ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే సరైన మార్గమని తెలిపారు. కొల్లూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం వేమూరు నియోజకవర్గ సీఐటీయూ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు స్కీమ్ వర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి నేడు ఆ విషయంపై నోరు విప్పడంలేదని విమర్శించారు. కార్మిక వర్గాల సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. రాబోయే కాలంలో కార్మిక వర్గాల సమస్యల పరిష్కారం, భవిష్యత్తు కర్తవ్యాలపై చర్చించేందుకు జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. రేపల్లెలో ఈనెల 27, 28 తేదీలలో జరిగే జిల్లా మహాసభలకు ఉద్యోగులు, కార్మికులు, స్కీమ్ వర్కర్లు హాజరై జయప్రదం చేయాలని ఆమర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి. మనోజ్, బి. అగస్టిన్, బొనిగల సుబ్బారావు, శ్రీను, భాగ్యమ్మ పాల్గొన్నారు.

రేపు దేవాలయాల్లో సామూహిక హారతులు


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

కోనేటిపురం(భట్టిప్రోలు): కోనేటిపురంలోని దళితవాడ కోదండ రామాలయం మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ హిందువులంతా కుల భేదాలు లేకుండా ఐక్యత సాధిస్తూ, హిందూ ధర్మ రక్షణకు పాటుపడాలని కోరారు. ఆదివారం భాద్రపద శుద్ధ పౌర్ణమి చంద్ర గ్రహణం సందర్భంగా సోమవారం అన్ని దేవాలయాల్లో సామూహిక హారతులు మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంపనం హేమ శంకరరావు, జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, నిర్వాహకులు చింతల మురళీకృష్ణ, జంగం శ్యామ్ ప్రసాద్, శొంటి బాబు రావు, నంబూరు వేణు, రమాదేవి పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిల వసూళ్లు వేగవంతం చేయాలి

- వ్యవసాయ, సూర్య ఘర్ కనెక్షన్‌లు పెంపుకు చొరవ చూపాలి
- ఏపీసీపీడీసీఎల్ తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి. చిరంజీవి


మాట్లాడుతున్న ఈఈ చిరంజీవి

తెనాలిటౌన్: తెనాలి డివిజన్ పరిధిలోని విద్యుత్ బకాయిల వసూళ్లు వేగవంతం చేయాలని ఏపీసీపీడీసీఎల్ తెనాలి డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి.చిరంజీవి అధికారులను ఆదేశించారు. స్థానిక చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయంలో శనివారం డివిజన్ పరిధిలోని అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు పెంచాలని, ప్రధానమంత్రి, సూర్యఘర్ పథకానికి సంబంధించి కనెక్షన్‌ల పెంపు మరింత వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రూ.2లక్షల ఖర్చు అయ్యే ఈ పథకానికి సంబంధించి లక్ష రూపాయిలు వరకు రుణ సౌకర్యం లభిస్తుందని చెప్పారు. ఇళ్లకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. మీటరు ద్వారా లైన్‌లోకి వచ్చే కరెంట్‌కు విద్యుత్‌శాఖ గృహ వినియోగదారులకు నగదు చెల్లిస్తుందని స్పష్టం చేశారు. సౌర విద్యుత్ వినియోగం వలన గణనీయంగా విద్యుత్ బిల్లు తగ్గుతుందని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా నిర్దేశించిన ఏజెన్సీ ద్వారా సోలార్ ప్యానల్స్ బిగించి సూర్యఘర్ పథకం కింద అర్హులుగా చేర్చుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే అర్హులను గుర్తించి జాబితా తయారు చేశామని వెల్లడించారు. లబ్ధిదారులకు పక్కా ఇల్లు ఉండాలని, అంగీకారపత్రం ఇస్తే సంబంధించి కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా ప్యానల్స్ బిగిస్తామని వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం రాయితీగా అందించే 200 లోపు ఉచిత విద్యుత్ వినియోగానికి స్థానిక సచివాలయంలో సంప్రదించాలని కోరారు. సచివాలయం నుంచి వచ్చిన జాబితా ప్రకారం ఉచిత విద్యుత్ అందిస్తామని వివరించారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే స్థానిక విద్యుత్ కార్యాలయంలో సంప్రదించాలని వినియోగదారులకు సూచించారు. వ్యవసాయ కనెక్షన్‌లు ఇప్పటికే 900 ఇచ్చినట్లు స్పష్టం చేశారు. కనెక్షన్ కావాల్సిన వారు స్థానిక విద్యుత్ కార్యాలయంలో సంప్రదించాలని రైతులకు స్పష్టం చేశారు. సమావేశంలో డీఈలు బోరుగడ్డ అశోక్‌కుమార్, శ్యామ్ సుందర్, రాజశేఖర్‌బాబు, డివిజన్ పరిధిలోని ఏఈలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కర్లపాలెం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర చెప్పారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని రాళ్ల చెరువు సమీపంలో కోతముక్క ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న రూ.7,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పేకాటరాయుళ్లు, బహిరంగంగా మద్యం తాగే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఇసుక అక్రమంగా తరలింపు ప్రారంభం



కొల్లూరు : వరద కారణంగా నదిలో నెల రోజుల నుంచి నిలిచిన ఇసుక తవ్వకాలు నీరు తగ్గగానే మొదలయ్యాయి. పెదలంక, ఈపూరులంక గ్రామాల పరిధిలోని కృష్ణా నదిలో ఊపందుకున్నాయి. పలు గ్రామాల్లోని మెరక ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను కూటమి నాయకులు తరలించి సొమ్ము చేసుకున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం నదిలో ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేసి, అక్రమ రవాణాను అడ్డుకోవడంలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కానవస్తోంది. ఇసుక అక్రమ రవాణా నదీ తీర గ్రామాల్లో విచ్చలవిడిగా జరుగుతోంది. ప్రస్తుతం పెదలంక అరవింద వారధి ప్రాంతం, ఈపూరులంక కృష్ణా నది నుంచి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు.

ముగిసిన అర్ధ చాతుర్మాస వ్రతదీక్షలు

పట్టణంలో ఘనంగా శోభాయాత్ర



తెనాలి: సాలిగ్రామం మఠం ఆధ్వర్యంలో స్థానిక గంగానమ్మ పేటలోని ది కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరుగుతున్న పెనుగొండ పీఠాధిపతి శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామీజీ అర్ధ చాతుర్మాస వ్రత దీక్షా మహోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం పట్టణంలో కోలాహలంగా స్వామీజీ శోభాయాత్రను నిర్వహించారు. మేళతాళాలు, కోలాటం, భక్తి కీర్తనలతో యాత్ర కొనసాగింది. సాలిగ్రామ మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, పల్లిపోతు మురళీ మనోహర్, పెనుగొండ వెంకటేశ్వరరావు, గోవు రామకృష్ణ, రాజేశ్వరరావు, లోకనాథం, సాలిగ్రామ మఠం సభ్యులు, శ్రీవిద్యాపీఠం సభ్యులు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు, అధికసంఖ్యలో మహిళలు పాల్గొని శోభాయాత్రను జయప్రదం చేశారు. సలహా మండలి చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, సంస్కృతి విభాగం చైర్మన్ గడ్డిపాటి శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. చావలి భక్తబృందం ప్రదర్శించిన కోలాటం, భక్తపాటలు ఆకట్టుకున్నాయి.

మహిళల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి

తెనాలి టౌన్: స్త్రీలోని దైవిక చైతన్యం జాగృతి అయినప్పుడు ఆమె అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది కుటుంబానికి, సమాజానికి, దేశానికి దిక్సూచిలా మారుతుందని అచ్యుతదాసాజి పేర్కొన్నారు. రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలోని శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవసేవ ఆలయంలో శనివారం మహిళలకు స్త్రీ శక్తి వరం పేరిట ఉచిత ఆధ్యాత్మిక శిక్షణ తరగతులు నిర్వహించారు.
అమృత దాసాజీ స్వామిజీ పాల్గొని శ్రీ పరంజ్యోతి భగవతి భగవానుల సంకల్పాన్ని వివరించారు. దైవిక చైతన్యాన్ని జాగృతం చేసి ఆమెలో ఆరోగ్య చైతన్యాన్ని, ఐశ్వర్య చైతన్యాన్ని పెంపొందించడం జరుగుతుందన్నారు. తద్వారా స్త్రీ అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదుగుతుందని చెప్పారు. అనంతరం మహిళలకు సప్త కోశ జ్ఞానాన్ని వివరించారు. శిక్షణ తరగతుల్లో 32 గ్రామాల నుంచి 350 మంది మహిళలు పాల్గొన్నారు. వీరందరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పించారు.

ఇంటింటికీ 'మన మిత్ర' సేవలపై అవగాహన


సేవలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుదీప


జంపనిలో ర్యాలీ

చుండూరు(వేమూరు): ప్రభుత్వ సర్వీసులను ఇంటి వద్దే పొందేందుకు ప్రభుత్వం మన మిత్ర సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఎంపీడీవో సుదీప తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాల్లో శనివారం సేవలను ప్రారంభించారు. ఇంటి నుంచి వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సర్వీసులు పొందడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పొలాల అడంగళ్లు, 1బి, విద్యార్థుల కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయం సర్టిఫికెట్లు ఫోన్‌లోనే వాట్సాప్ ద్వారా పొందవచ్చని ఎంపీడీవో సుదీప తెలిపారు. సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి మన మిత్ర సేవలపై అవగాహన కల్పిస్తారని ఆమె చెప్పారు. సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

వేమూరు: ప్రజలు చేతిలో ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలని రేపల్లె లెవెల్ పంచాయతీ అధికారి పద్మావతి తెలిపారు.. వేమూరు మండలంలోని జంపనిలో ప్రజల చేతిలో ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. సేవలపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వాట్సాప్ సేవలపై గ్రామస్తులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవి కుమార్, పంచాయతీ కార్యదర్శి భూపతి రెడ్డి గ్రామ సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాట్సప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ సేవల విధులు బహిష్కరిస్తాం

తెనాలిలో సచివాలయ ఉద్యోగులు ఆందోళన


ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు


ఇన్‌చార్జి కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు నూతనంగా కేటాయించిన వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ సేవలను ఉద్యోగులందరూ బహిష్కరించినట్లు ఆంధ్రప్రదేశ్ విలేజ్ వార్డు సెక్రటేరియట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ప్రకటించారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వలంటరీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆ విధులన్నీ ఉద్యోగులందరికీ అప్పగించడం బాధాకరమన్నారు. తాము ఇంటింటికీ వెళ్లి వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ సేవల విధులను చేయాలంటూ ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మర్రి శేషుబాబు, తెనాలి ఉపాధ్యక్షుడు పి.వీరేంద్రకుమార్, జనరల్ సెక్రటరీ పిన్ని రాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ పినపాటి సందీప్, పి.ఆశాదీప్, ఆలపాటి నాగార్జున, మునగాల పృథ్వీ రాజు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి పట్టణ అభివృద్ధికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక


శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్

తెనాలిఅర్బన్: పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 15వ వార్డు మల్లాదివారి వీధిలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌన్సిలర్ల విజ్ఞప్తి మేరకు పట్టణంలో మురుగు కాల్వలు, డ్రైయిన్‌ల నిర్మాణాలు చేస్తున్నట్లు చెప్పారు. ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ మాట్లాడుతూ రూ.13.25 లక్షల నిధులతో రోడ్డును నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, డీఈ శ్రీనివాసులు, ఏఈ జానీబాషా పాల్గొన్నారు.

తెనాలిలో జ్వరాల నియంత్రణకు ప్రత్యేక వార్డు

- అక్కడే డాక్టర్, నర్సులు ఉండే విధంగా చర్యలు
- సెకండరీ హెల్త్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు


జ్వరపీడితులతో మాట్లాడుతున్న డాక్టర్ రంగారావు

తెనాలిఅర్బన్: డివిజన్‌లో జ్వరాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వైద్యశాలలో 25 బెడ్‌లతో కూడిన ప్రత్యేక వార్డును ఏర్పాటు చేస్తున్నట్లు సెకండరీ హెల్త్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు ప్రకటించారు. సాక్షి దినపత్రికలో శనివారం తెనాలికి జ్వరమొచ్చింది శీర్షికన కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సెకండరి హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిలు వెంటనే తెనాలి వైద్యశాలకు వెళ్ళి పరిస్థితిని తెలియజేయాలని ఆదేశించారు. దీంతో జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు ఆకస్మికంగా శనివారం తెనాలి జిల్లా వైద్యశాలను పరిశీలించారు. జ్వరపీడితులతోమాట్లాడి వారికి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. జ్వరంతోపాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి అక్కడే డాక్టర్, నర్సులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ల్యాబ్ టెక్నీషియన్లు వార్డులకు వచ్చి జ్వరపీడితుల శాంపిల్స్‌ను కలెక్ట్ చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. 24 గంటలు అందరూ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అలాగే గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో కలెక్ట్ చేసిన 200 శాంపిల్స్‌ను తెనాలిలో పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. జిల్లా వైద్యశాలకు శనివారం 74 మంది అడ్మిట్ అయ్యారని, వారిలో 27 మంది జ్వరపీడితులన్ని చెప్పారు. ఇటీవల జరిగిన పదోన్నతుల కారణంగా వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది కొరత ఏర్పడిందని, జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎం డాక్టర్ మల్లిఖార్జునరావు, పలువురు వైద్యులు సిబ్బంది ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన

తెనాలి రూరల్: జాతీయ పోషకాహార వారంలో భాగంగా తెనాలిలోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని పెదరావూరు ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మెంటార్ పి.భార్గవి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ టి. జ్యోతిబసు, కె.కళ్యాణ్ చక్రవర్తి, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఫాస్ట్ ఫుడ్‌లు, జంక్ ఫుడ్‌లు ఆరోగ్యానికి హానికరమని, పాలు, పండ్లు, కూరగాయలు, గింజలు వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలకు పోషకాహార పదార్థాలను పంపిణీ చేశారు. కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ కె. వెంకట రమణ పర్యవేక్షించారు.